

అభివృద్ధిని చూసి ఆదరిస్తున్నారు

రాష్ట్రంలో చేసిన అభివృద్ధిని చూసి దేశమంతా బీఆర్ఎస్‌ను ఆదరిస్తున్నారని రాష్ట్ర అటవీ, పర్యావరణ, దేవాదాయ, న్యాయశాఖ మంత్రి అల్లోల ఇంద్రకరణ్‌రెడ్డి అన్నారు.

10లో▸



చల్లని తల్లి.. గజ్జలమ్మ 9లో▸

కుంటాల గ్రామం గజ్జలమ్మను తమ ఇలవేల్పుగా కొలుస్తూ తమ ఊరి ప్రత్యేకతను నిలుపుకుంటున్నారు. మూడు రోజులు నిర్వహించే ఆలయ వార్షికోత్సవాలు గురువారం ప్రారంభమయ్యాయి.

గరిష్టం/కనిష్టం 31.3 / 14.2

వాతావరణం

వాతావరణం పొడిగా ఉంటుంది. పగలు ఎండ ఎక్కువగా అనిపిస్తుంది. రాత్రి ఉష్ణోగ్రతలు నాలుగు డిగ్రీలు తగ్గుతాయి. చలి ప్రభావం పెరుగుతుంది.





కమనీయం.. లక్ష్మీనృసింహుడి కల్యాణం

కడెం మండలం దిల్దార్‌నగర్, ఏలగడప, సారంగాపూర్ గ్రామాల సమీపంలో గోదావరి తీరాన కొండగుహలో కొలువుదీరిన అక్కకొండ శ్రీలక్ష్మీనృసింహస్వామి వార్షిక బ్రహ్మోత్సవాలు వైభవంగా జరుగుతున్నాయి. ఉత్సవాల్లో భాగంగా గురువారం స్వామివారి కల్యాణం వైభవంగా నిర్వహించారు. అర్చకులు వొద్దిపర్తి వంశీకృష్ణమాచార్యుల అధ్వర్యంలో ముందుగా ధ్వజారోహణం, ఎదుర్కోలు కార్యక్రమం నిర్వహించారు. అనంతరం లక్ష్మీనృసింహుల ఉత్సవమూర్తులను వేదికపై ఉంచి వేదమంత్రాల మధ్య కల్యాణం జరిపించారు. భక్తులు అధిక సంఖ్యలో హాజరై వేడుకలను తిలకించారు. ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం భక్తులకు అన్నదానం చేశారు. ఈనెల 5న స్వామివారి రథోత్సవం, జాతర ఉంటుందని ఆలయ కమిటీ చైర్మన్ బుర్ర రాజారమేశ్‌గౌడ్ తెలిపారు. కార్యక్రమంలో సర్పంచులు రాజిరెడ్డి, సత్తెమ్మ, విజయ, ఆలయ కమిటీ గౌరవ అధ్యక్షుడు జగ్గారెడ్డి, ఉప సర్పంచుల ఫోరం మండల అధ్యక్షుడు ముదికె మల్లేశ్ తదితరులు పాల్గొన్నారు – కడెం





మాస్టారైన కలెక్టర్

కలెక్టర్ వరుణ్‌రెడ్డి లెక్కల మాస్టార్‌గా మారారు. మండలంలోని కల్లూర్ ప్రాథమికోన్నత పాఠశాలను గురువారం సందర్శించారు. మన ఊరు – మన బడి పనులు పరిశీలించిన అనంతరం ఉన్నత పాఠశాలలోని 10వ తరగతికి వెళ్లారు. మ్యాథ్స్ క్లాస్ నడుస్తుండడంతో కలెక్టర్ ఉపాధ్యాయుడిగా మారారు. చాక్‌పీస్ పట్టి గణితం బోధించారు. విద్యార్థులకు ప్రశ్నలు వేసి సమాధానం రాబట్టారు. విద్యార్థులు తడబడుతూ సమాధానం చెప్పడంతో గణిత బోధకుడు విఠల్ పై ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇన్‌చార్జి హెచ్‌ఎంగా ఉన్న విఠల్ విద్యార్థుల హాజరు తక్కువగా ఉండడంతో నోటీసులు జారీ చేయాలని డీఈవోను ఆదేశించారు. పదో తరగతితో ఉత్తమ ఫలితాలు సాధించేలా ఉపాధ్యాయులు కృషి చేయాలని సూచించారు. ఆయన వెంట డీఈవో రవీందర్‌రెడ్డి, డీఎంహెచ్‌వో ధనరాజ్, హెచ్‌ఎంలు ముత్యం, అమృతం, ఆర్‌అండ్‌బీ ఏఈ రఘు తదితరులు ఉన్నారు. భైంసాలో మన బస్తీ మన బడిలో భాగంగా చేపట్టిన పనులను పరిశీలించారు. విద్యార్థులతో మాట్లాడి, వారి అభ్యసన సామర్థ్యాలు పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. – కుంటాల/భైంసాటౌన్

న్యూస్‌రీల్

కలెక్టర్‌ను కలిసిన ఎస్పీ



కలెక్టర్‌కు మొక్క అందిస్తున్న ఎస్పీ

నిర్మల్‌టౌన్: నూతన కలెక్టర్ వరుణ్‌రెడ్డిని జిల్లా ఎస్పీ ప్రవీణ్‌కుమార్ గురువారం మర్యాదపూర్వకంగా కలిశా రు. పూలమొక్క అందించి శుభాకాంక్షలు తెలిపారు.

పిప్రి ఎత్తిపోతల పథకం ద్వారా నీరందించాలి



మాట్లాడుతున్న పడకంటి రమాదేవి

లోకేశ్వరం: పిప్రి ఎత్తిపోతల పథకం ద్వారా చివరి ఆయకట్టుకు నీరందించాలని బీజేపీ జిల్లా అధ్యక్షురాలు పడకంటి రమాదేవి కోరా రు. మండల కేంద్రంలోని వివేకానంద విగ్రహం వద్ద గురువారం ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడారు. గతంలో నిర్వహించిన సర్వే ప్రకారంగా పిప్రి ఎత్తిపోత పథకం పూర్తిస్థాయిలో సాగు నీరందించాలన్నారు. అప్పట్లో సర్వే నిర్వహించిన అధికారులు పిప్రి, మొహాళ, నగర్ తండా, నగర్, రాయపూర్‌కాండ్లీ, లోకేశ్వరం గ్రామాల భూములకు నీరందిస్తామని చెప్పారని, ఇప్పుడు మాట మారుస్తున్నారని పేర్కొన్నారు. బడ్జెట్ సరిపోవడం లేదని అధికారులు, కాంట్రాక్టర్ దాటవేస్తున్నారని విమర్శించారు. బీజేపీ మండల అధ్యక్షుడు గంగాధర్, నాయకులు రాజశేఖర్, నవీన్‌రావు, సాయన్న, రాములు, నర్సయ్య, గంగారెడ్డి ఉన్నారు.

ఆర్‌ఎంవోను అభినందించిన మంత్రి



ఆర్‌ఎంవోను అభినందిస్తున్న మంత్రి ఐకేరెడ్డి

నిర్మల్‌టౌన్: జిల్లా ప్రభుత్వ ఆసుపత్రి ఆర్‌ఎంవో డాక్టర్ వేణుగోపాలకృష్ణను మంత్రి ఇంద్రకరణ్‌రెడ్డి గురువారం అభినందించారు. మెడికో లీగల్ పోస్టుమార్టంలు అత్యధికంగా నిర్వహించి రాష్ట్రస్థాయిలో వేణుగోపాలకృష్ణకు గుర్తింపు లభించింది. దీంతో మంత్రి తన నివాసంలో ప్రశంసాపత్రంతో అభినందించారు.



ధాన్యం దందా!

ఈ చిత్రంలో నిర్లక్ష్యంగా పారవేసినట్లు కనిపిస్తున్న ధాన్యం సంచులు భైంసాలోని ఓ గోదాంలో నిల్వ ఉంచినవి. ప్రభుత్వం సీఎంఆర్ కోసం కేటాయించిన ధాన్యం సంచులు ఇలా నిర్లక్ష్యంగా వదిలేయడంతో చాలావరకు పురుగులు పట్టగా, మరికొంత నేలపాలైంది. సంబంధిత అధికారులు క్షేత్రస్థాయిలో తనిఖీలు చేయకపోవడంతో కొందరు మిల్లర్లు ఇలా ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నారు.

రూ.లక్షల్లో అక్రమార్జన...

ప్రభుత్వం కేటాయించిన ధాన్యం క్వింటాకు 67 కిలోల బియ్యం చొప్పున మిల్లర్లు అప్పగించాల్సి ఉంటుంది. ఇందుకుగాను మరపట్టించేందుకు ప్రభుత్వం మిల్లర్లకు కొంతమొత్తం చెల్లిస్తుంది. అయితే, చాలామంది మిల్లర్లు బియ్యం పట్టించకుండా వక్రమార్గం పడుతున్నారు. మార్కెట్‌లో పీడీఎస్ బియ్యం రూ.14 నుంచి రూ.18లకు కొనుగోలు చేస్తూ వాటినే పాలిషింగ్ చేసి ఎఫ్‌సీఐకి అప్పగిస్తున్నారు. సర్కారు కేటాయించిన ధాన్యం క్వింటాకు రూ.2,800 చొప్పున విక్రయించి సొమ్ము చేసుకుంటున్నారు. ఇలా ప్రభుత్వ ధాన్యంతో దర్జాగా దందా కొనసాగిస్తున్నా.. సంబంధిత అధికారులు పట్టించుకోకపోవడంపై సందేహాలు వ్యక్తమవుతున్నాయి.

- ప్రభుత్వ ధాన్యంతో మిల్లర్ల వ్యాపారం
- లారీల్లో ఇతర ప్రాంతాలకు తరలించి విక్రయం
- పట్టించుకోని పౌర సరఫరాల శాఖ అధికారులు

భైంసాటౌన్: ప్రభుత్వం మిల్లింగ్ చేసేందుకు ఇచ్చిన ధాన్యంతో జిల్లాలో మిల్లర్లు అక్రమదందా చేస్తున్నారు. మర పట్టించేందుకు ఇచ్చిన ధాన్యాన్ని కొందరు మిల్లర్లు నిజామాబాద్, కామారెడ్డి, తదితర ప్రాంతాలకు తరలించి విక్రయిస్తూ సొమ్ము చేసుకుంటున్నారు. ఈ విషయమై పౌరసరఫరాల శాఖ ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులతోపాటు సంబంధిత జిల్లా అధికారులకు సమాచారమిచ్చినా పట్టించుకోవడం లేదనే విమర్శలున్నాయి. ఈ అక్రమతంతు సంబంధిత అధికారులకు తెలిసే జరుగుతోందని, అందుకే చర్యలకు వెనుకాడుతున్నారన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి. అడిగేవారు లేకపోవడంతో గోదాముల్లో నుంచి నేరుగా లారీల్లో ధాన్యం తరలిస్తున్నట్లు తెలుస్తోంది.

సర్కారు ధాన్యంతో దర్జాగా...

ప్రభుత్వం రేషన్ దుకాణాల ద్వారా పేదలకు రాయితీపై బియ్యం అందిస్తోంది. ఇందుకుగాను ఏటా రైతుల నుంచి ధాన్యం కొనుగోలు చేసి బియ్యం పట్టించి ఇచ్చేందుకుగాను సీఎంఆర్ కోసం రైస్‌మిల్లులకు కేటాయిస్తుంది. ఇలా ఇచ్చిన ధాన్యాన్ని మిల్లర్లు బియ్యం పట్టించి ఎఫ్‌సీఐకి అప్పగించాల్సి ఉంటుంది. కానీ, చాలామంది మిల్లర్లు నామమాత్రంగా మిల్లింగ్ చేస్తూ మిగిలిన ధాన్యం ప్రైవేట్‌గా విక్రయించుకుంటున్నారు. ప్రభుత్వానికి మర పట్టించి అప్పగించాల్సిన బియ్యానికి బదులు దళారుల ద్వారా పీడీఎస్ బియ్యం కొనుగోలు చేస్తూ, వాటినే మరోసారి పాలిష్ చేసి ఎఫ్‌సీఐకి అప్పగిస్తున్నారు.

తనిఖీలు చేస్తాం..

ప్రభుత్వం సీఎంఆర్ కోసం కేటాయించిన ధాన్యం విక్రయిస్తే చర్యలు తీసుకుంటాం. గోదాముల్లో తనిఖీలు చేపట్టి ధాన్యం నిల్వలు పరిశీలిస్తాం. తక్కువగా ఉన్నట్లు తేలితే చర్యలు తీసుకుంటాం.

– తనూజ, పౌరసరఫరాల శాఖ జిల్లా అధికారి, నిర్మల్

తనిఖీలతోనే వెలుగులోకి...

జిల్లావ్యాప్తంగా గత ఖరీఫ్, రబీ సీజన్లలో ప్రభుత్వం రైస్‌మిల్లులకు ఎంత ధాన్యం కేటాయించింది.. మిల్లర్లు ఎంతమేర బియ్యం తిరిగి ప్రభుత్వానికి అప్పగించారు.. ఇంకా గోదాముల్లో ఎంత ధాన్యం నిల్వ ఉందనే విషయంపై సంబంధిత అధికారులు తనిఖీలు నిర్వహిస్తే మిల్లర్ల అక్రమాలు వెలుగులోకి వస్తాయని పలువురు అభిప్రాయం వ్యక్తం చేస్తున్నారు.

ప్రతీ కూలీకి వంద రోజులు పని కల్పించాలి



మాట్లాడుతున్న డీఆర్డీవో విజయలక్ష్మి

భైంసారూరల్: ప్రతీ కూలీకి ఏడాదిలో వంద రోజులు పని కల్పించాలని డీఆర్డీవో విజయలక్ష్మి సూచించారు. భైంసా మండల పరిషత్ కార్యాలయంలో ఉపాధిహామీ సిబ్బందితో గురువారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ వంద రోజులు పని పూర్తికాని కూలీలను గుర్తించి వారికి పని కల్పించాలని తెలిపారు. ప్రతీ గ్రామ పంచాయతీకి వంద మంది కూలీలకు పనులు కల్పించాలన్నారు. జాబ్‌కార్డుతో ఆధార్ కార్డును అనుసంధానం చేయాలన్నారు. వ్యక్తిగత పనులకు ప్రాధాన్యత కల్పిస్తూ పశువుల తొట్లు, చేపల పెంపకంలాంటి పనులు చేయించాలని తెలిపారు. గడువులోపు వందశాతం పనులు జరిగేలా చూడాలన్నారు. నిర్లక్ష్యం వహించేవారిపై చర్యలు తప్పవని హెచ్చరించారు. జాబ్‌కార్డులు లేని వారికి వెంటనే అందించాలన్నారు. సమావేశంలో ఏపీడీ ఓన ప్రసాద్, డీఆర్పీ గంగాప్రసాద్, ఎంపీడీవో గోపాలకృష్ణారెడ్డి, ఆయా మండలాల ఉపాధిహామీ సిబ్బంది పాల్గొన్నారు.

పాఠశాలల్లో పచ్చదనం ఉట్టిపడాలి



వివరాలు అడిగి తెలుసుకుంటున్న కలెక్టర్

నిర్మల్‌టౌన్: మన ఊరు – మన బడి, మన ఊరు – మన బస్తీ పనులు పూర్తి చేసిన పాఠశాలలు పచ్చదనంతో ఉట్టిపడాలని కలెక్టర్ వరుణ్‌రెడ్డి సూచించారు. ఈమేరకు మొక్కలు నాటాలని ఆదేశించారు. కలెక్టరేట్‌లో సంబంధిత అధికారులతో సమీక్ష నిర్వహించారు. డీఈవో, ఎంఈవోలు, ఏజెన్సీలకు సంబంధించిన ఈఈ, డీఈలను వివరాలు అడిగి తెలుసుకున్నారు. రూ.30 లక్షలలోపు బడ్జెట్ ఉన్న పనులన్నీ నెల రోజుల్లో పూర్తి చేయాలని ఆదేశించారు. పనుల నాణ్యతలో రాజీ పడొద్దని పేర్కొన్నారు. పనులు జరిగిన వెంటనే వాటిని ఎంబీలో రికార్డ్ చేయాలని ఆదేశించారు. ప్రతీ మండలంలోని మోడల్ పాఠశాలల్లో కిచెన్ గార్డెన్ ఏర్పాటు చేయాలని సూచించారు. గ్రౌండ్ చదును చేసి అందంగా తీర్చిదిద్దాలని తెలిపారు. పాఠశాల గోడలపై ఆకర్షణీయమైన బొమ్మలు వేయించాలని పేర్కొన్నారు. 10వ తరగతి వార్షిక పరీక్షలు సమీపిస్తున్నందున ప్రత్యేక శ్రద్ధవహించి, పిల్లల్లో పరీక్షలంటే భయం పోయేలా చూడాలన్నారు. మెరుగైన ఫలితాలు సాధించేలా చర్యలు తీసుకోవాలని డీఈవోకు సూచించారు.

సాంకేతిక యుగంలో ఇంగ్లిష్‌కు ప్రాధాన్యం



ప్రశంసా పత్రాలు పొందిన విద్యార్థులు

నిర్మల్ రూరల్: సాంకేతిక ప్రపంచంలో ఆంగ్ల భాషకు మరింత ప్రాధాన్యం పెరిగిందని, విద్యార్థులు ఇంగ్లిష్‌పై పట్టు పెంచుకుని అవకాశాలను అందిపుచ్చుకోవాలని డీఈవో రవీందర్‌రెడ్డి అన్నారు. ఇంగ్లిష్ లాంగ్వేజ్ టీచర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో, భారతి ఫౌండేషన్ సహకారంతో జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ బాలికల ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు గురువారం జిల్లాస్థాయి స్టోరీ టెల్లింగ్, స్పెల్ విజార్డ్ పోటీలు నిర్వహించారు. 76 మంది ఈ పోటీల్లో పాల్గొన్నారు. ఇలాంటి పోటీలు విద్యార్థుల్లో ఆంగ్ల భాషపై మరింత ఆసక్తిని పెంచుతాయని పేర్కొన్నారు. కార్యక్రమంలో జిల్లా అధ్యక్షుడు రవీంద్ర, ప్రధాన కార్యదర్శి భూమనయాదవ్, కోశాధికారి రతన్‌కుమార్, అసోసియేట్ అధ్యక్షుడు వేణుగోపాల్, ఉపాధ్యాయులు డేవిడ్ గంగన్న, మల్లాగౌడ్, మనోహర్‌రెడ్డి, గంగాధర్, శ్రీపాద, వివేక్, సంజయ్, ప్రతాప్ తదితరులు పాల్గొన్నారు.

విజేతలు వీరే..

స్టోరీ టెల్లింగ్: ప్రథమ స్థానం.. ప్రవళిక, 9వ తరగతి(జెడ్పీహెచ్‌ఎస్, లింగాపూర్), ద్వితీయస్థానంలో దుర్గాప్రసాద్, 8వ తరగతి(జెడ్పీహెచ్‌ఎస్ మామడ).

స్పెల్ విజార్డ్: ప్రసన్న, 9వ తరగతి(లింగాపూర్) ప్రథమ స్థానం. సాజిదా కౌసర్(పెంబి) ద్వితీయ స్థానం సాధించారు.

గెలుపే లక్ష్యంగా పనిచేయాలి

- బీజేపీ అసెంబ్లీ పాలక్ కాటిపల్లి వెంకటరమణారెడ్డి



మాట్లాడుతున్న వెంకటరమణారెడ్డి

నిర్మల్: రాష్ట్రంలో పార్టీ గెలిచే అవకాశాలున్న అసెంబ్లీ స్థానాల్లో నిర్మల్ ముందుందని, ఇక్కడ ప్రతీ నాయకుడు, కార్యకర్త పార్టీ గెలుపే లక్ష్యంగా పని చేయాలని బీజేపీ నిర్మల్ నియోజకవర్గ పాలక్, నిజామాబాద్ జెడ్పీ మాజీ చైర్మన్ కాటిపెల్లి వెంకటరమణారెడ్డి అన్నారు. జిల్లా కేంద్రంలో గురువారం పార్టీ విస్తృతస్థాయి సమావేశం నిర్వహించారు. పోలింగ్‌బూత్‌స్థాయి నుంచి పార్టీ కార్యకర్తలు, నాయకులు సమావేశానికి హాజరయ్యారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ పార్టీ నాయకులు ప్రజాసమస్యలపై దృష్టి పెట్టి పరిష్కారానికి పోరాడాలన్నారు. పోలింగ్‌బూత్ స్థాయిలో గ్రామాల్లో పర్యటించి సమస్యలపై పోరాడాలని సూచించారు. సమావేశంలో జిల్లా అధ్యక్షురాలు రమాదేవి, పార్లమెంటు కన్వీనర్ అయ్యన్నగారి భూమయ్య, పెద్దపల్లి జిల్లా ఇన్‌చార్జి రావుల రాంనాథ్, జిల్లా ప్రధాన కార్యదర్శులు మెడిసెమ్మె రాజు, రాజేశ్వర్‌రెడ్డి, నియోజవర్గ నాయకులు డాక్టర్ మల్లికార్జున్‌రెడ్డి, మున్సిపల్ మాజీ చైర్మన్ అప్పాల గణేశ్‌చక్రవర్తి, అసెంబ్లీ కన్వీనర్ నాయిడి మురళీధర్, సంఘటన మంత్రి అఖిలేశ్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

పంట తడి కోసం రైతులు కంటతడి



విద్యుత్ కార్యాలయానికి ర్యాలీగా వస్తున్న నాయకులు



విద్యుత్ కార్యాలయం ఎదుట బైఠాయించిన మహేశ్వర్‌రెడ్డి, నాయకులు

- కరెంటివ్వక కన్నీళ్లు పెట్టిస్తున్న సర్కార్
- ఉత్తర తెలంగాణకే ఏసీడీ చార్జీలు ఎందుకు..?
- ఏఐసీసీ కార్యక్రమాల అమలు కమిటీ చైర్మన్ ఏలేటి

నిర్మల్: తెలంగాణలో రైతులు పంట తడి కోసం కంటతడి పెడుతున్నారని, ఎద్దు ఏడ్చిన వ్యవసాయం, రైతు ఏడ్చిన రాజ్యం బాగుపడదని ఏఐసీసీ కార్యక్రమాల అమలు కమిటీ చైర్మన్ ఏలేటి మహేశ్వర్‌రెడ్డి అన్నారు. వ్యవసాయానికి 24 గంటల కరెంటు ఇవ్వాలని, ఏసీడీ చార్జీలు రద్దు చేయాలని విద్యుత్ శాఖ కార్యాలయాన్ని రైతులతో కలిసి గురువారం ముట్టడించారు. ముందుగా మహేశ్వర్‌రెడ్డి తన నివాసంలో రైతులు, కాంగ్రెస్ నాయకులతో సమావేశమయ్యారు. అక్కడి నుంచి బైక్‌ర్యాలీగా బయలుదేరి, మార్గమధ్యలో అంబేద్కర్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం విద్యుత్ శాఖ కార్యాలయాన్ని ముట్టడించారు. అక్కడే బైఠాయించి, ఏసీడీ చార్జీలు ఎత్తివేయాలని, వ్యవసాయానికి కోతలు లేకుండా కరెంటు ఇవ్వాలని డిమాండ్ చేశారు. మహేశ్వర్‌రెడ్డి మాట్లాడుతూ 24 గంటల ఉచిత కరెంటు ఇస్తున్నామని కేసీఆర్ సర్కారు అసత్య ప్రచారం చేస్తోందన్నారు. అప్రకటిత కోతలతో రైతులు కన్నీరు పెట్టుకునే దుస్థితి వచ్చిందని ఆవేదన వ్యక్తంచేశారు. ఏసీడీ పేరిట ఇష్టారీతిన చార్జీలు వసూలు చేస్తున్నారని, ఇవి కూడా ఒక్క ఉత్తర డిస్కంలోనే ఎందుకు పెంచారని ప్రశ్నించారు. సీఎం, ఆయన అల్లుడి పరిధిలోని డిస్కంలో ఎందుకు పెంచలేదని నిలదీశారు. ఉత్తర తెలంగాణలోనే ఏసీడీ పెంచి ప్రజలను ఇబ్బంది పెడుతున్నారని మండిపడ్డారు. ఏసీడీ చార్జీలు కట్టమని, మీ ఇష్టం వచ్చింది చేసుకోండని సవాల్ విసిరారు. అనంతరం విద్యుత్‌శాఖ కార్యాలయంలో వినతిపత్రం ఇచ్చారు.

సన్నాసి మంత్రికి సోయుందా..?

ఇక్కడున్న సన్నాసి మంత్రికి సోయి ఉందా అని ఇంద్రకరణ్‌రెడ్డిని ఉద్దేశించి మహేశ్వర్‌రెడ్డి మాట్లాడారు. 'భూములు, చెరువులు కబ్జా పెట్టుడు కాదు, ప్రజలను కాపాడుకోవాలి' అని హితవు పలికారు. ఉత్తర తెలంగాణ ప్రజలపైనే ఏసీడీ చార్జీల భారం ఎందుకు వేస్తున్నారో సీఎంను ప్రశ్నించాలని డిమాండ్ చేశారు. విద్యుత్ చార్జీలు తగ్గించి, కోతల్లేని కరెంటు ఇచ్చేదాకా కాంగ్రెస్ పోరాడుతుందని స్పష్టం చేశారు. పంట రుణాలు మాఫీ చేయకపోవడంతో రైతుబంధు డబ్బులు వడ్డీలకే సరిపోతున్నాయని పేర్కొన్నారు. రైతుకు ఒక్క వ్యవసాయ పరికరంపై సబ్సిడీ లేకుండా చేశారని ఆరోపించారు. రైతులు పండించిన ధాన్యం కొనుగోలు సమయంలో కోత విధిస్తున్నారని మండిపడ్డారు. గిట్టుబాటు ధరలు లేక ఆత్మహత్యలు చేసుకుంటున్న రైతు కుటుంబాలను పరామర్శించే సమయం కూడా పాలకులకు లేదా అని ప్రశ్నించారు. ధర్నాలో రైతులు, కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

విద్యుత్ కోతలపై బీజేపీ రాస్తారోకో

కుభీర్: అప్రకటిత విద్యుత్ కోతలను నిరసిస్తూ కుభీర్ సబ్‌స్టేషన్ ఎదుట రైతులు గురువారం ధర్నా, రాస్తారోకో చేశారు. వీరికి మద్దతుగా బీజేపీ నాయకులు, కార్యకర్తలు ఆందోళనలో పాల్గొన్నారు. బీజేపీ జిల్లా అధ్యక్షురాలు రమాదేవి మాట్లాడుతూ ప్రభుత్వం రైతులకు 24 గంటలు ఉచిత విద్యుత్ అని గొప్పగా చెప్పుకుంటూ ఆచరణలో 8, 9 గంటల కంటే ఎక్కువ ఇవ్వడంలేదని విమర్శించారు. అది కూడా రాత్రి ఇస్తోందని ఆరోపించారు. వేళాపాల లేకుండా విద్యుత్ ఇవ్వడంతో రైతులు అయోమయానికి గురవుతున్నారన్నారు. అనంతరం విద్యుత్ ఏఈ అజీజొద్దీన్‌కు వినతిపత్రం ఇచ్చారు. ఆందోళనలో బీజేపీ నాయకులు లింబాద్రి, ఏశాల దత్తాత్రి, తోకల మారుతి, మల్లేశ్, గణపతి, రాథోడ్ సుధాం, తదితరులు పాల్గొన్నారు.

అందరూ కంటి పరీక్షలు చేసుకోవాలి



వివరాలు తెలుసుకుంటున్న కలెక్టరు వరుణ్‌రెడ్డి



వివరాలు తెలుసుకుంటున్న శ్యామ్‌రావు రాథోడ్

- కలెక్టర్ వరుణ్‌రెడ్డి

భైంసాటౌన్/లోకేశ్వరం:జిల్లాలో అందరూ కంటి వెలుగు కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకోవాలని, కంటి పరీక్షలు చేసుకోవాలని కలెక్టరు వరుణ్‌రెడ్డి సూచించారు. భైంసా ఓవైసీనగర్ ప్రభుత్వ ప్రాథమిక పాఠశాల ఆవరణలో ఏర్పాటు చేసిన కంటివెలుగు శిబిరాన్ని, లోకేశ్వరం మండలంలోని హావర్గ గ్రామంలో కంటి వెలుగు శిబిరాన్ని డీఎంహెచ్‌వో ధనరాజ్‌తో కలిసి గురువారం పరిశీలించారు. ఈసందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ కంటి వెలుగులో కంటి పరీక్షలు చేసుకున్నవారికి అవసరం మేరకు కంటి అద్దాలు ఇస్తారని తెలిపారు. వైద్యులు అందుబాటులో ఉండి వైద్యం అందించాలన్నారు. వైద్య సిబ్బందికి ప్రజలు సహకరించాలని సూచించారు. అనంతరం వైద్యులతో మాట్లాడారు. కంటివెలుగు శిబిరాల్లో మెరుగైన సేవలందించాలని, ఎక్కువగా నమోదవుతున్న దృష్టిలోపాలకు సంబంధించి కంటి అద్దాలు, మందుల కొరత లేకుండా చూడాలని సూచించారు. ఆయన వెంట తహసీల్దార్ సరిత, నర్సాపూర్ పీహెచ్‌సీ వైద్యుడు రాకేశ్, మతీన్, డిప్యూటీ తహసీల్దార్ అశోక్, సర్పంచుల సంఘం మండల అధ్యక్షుడు భూజంగ్‌రావు ఉన్నారు.

లక్ష్మణచాందలో..

లక్ష్మణచాంద: మండల కేంద్రంలోని కంటి వెలుగు శిబిరాన్ని జిల్లా హార్టికల్చర్ అధికారి, మండల ప్రత్యేకాధికారి శ్యామ్‌రావ్ రాథోడ్ పరిశీలించారు. ఇప్పటి వరకు ఎంత మందికి కంటి పరీక్షలు నిర్వహించారు, ఎంతమందికి అద్దాలు ఇచ్చారు, ఎంత మందికి కంటి అద్దాల కోసం ఆర్డర్ చేశారు అనే వివరాలు తె లుసుకున్నారు. ఆయన వెంట వైద్యురాలు శ్వేత, కంటి వైద్యుడు లక్ష్మణ్, సిబ్బంది యాస్మిన్, శివకృష్ణ, ఆశ కార్యకర్తలు పాల్గొన్నారు.

క్లుప్తంగా

రేపు అండర్‌-15 ఉమ్మడి జిల్లా జట్ల ఎంపిక

రెబ్బెన(ఆసిఫాబాద్‌): గోలేటి టౌన్‌షిప్‌లోని సింగరేణి ఉన్నత పాఠశాల మైదానంలో శనివారం ఉదయం ఉమ్మడి జిల్లా సబ్‌ జూనియర్స్‌ అండర్‌–15 బాల్‌ బ్యాడ్మింటన్‌ బాలబాలికల జట్ల ఎంపిక పోటీలు నిర్వహించనున్నట్లు అసోసియేషన్‌ జిల్లా ప్రధాన కార్యదర్శి ఆర్‌.నారాయణరెడ్డి తెలిపారు. క్రీడాకారులు వయస్సు ధ్రువీకరణ పత్రంతో హాజరు కావాలని సూచించారు. ఎంపికైన జిల్లా జట్లు ఈ నెల 11, 12వ తేదీల్లో నిజామాబాద్‌ జిల్లా ఆర్మూర్‌లో జరిగే రాష్ట్రస్థాయి పోటీల్లో పాల్గొంటారని తెలిపారు. వివరాలకు గోలేటి షార్ప్‌ స్టార్‌ బాల్‌ బ్యాడ్మింటన్‌ అసోసియేషన్‌ ప్రధాన కార్యదర్శి మారిన వెంకటేశ్వర్లును 9866652 249 నంబరులో సంప్రదించాలని కోరారు.

లారీ బోల్తా.. తప్పిన ప్రమాదం

గుడిహత్నూర్‌: మండలంలోని జాతీయ రహదారి 44 డోంగర్‌గావ్‌ వద్ద లారీ బోల్తా పడింది. ఈ ప్రమాదంలో లారీలోని డ్రైవర్, క్లీనర్లకు ఎలాంటి గాయాలు కాకపోవడంతో ప్రాణప్రాయం తప్పింది. మైదా పిండి బస్తాలతో హైదరాబాద్‌ నుంచి ఆదిలాబాద్‌ వైపు వెళ్తున్న క్రమంలో లారీ అదుపుతప్పి బోల్తాపడింది. దీంతో అందులోని పిండి బస్తాలు చెల్లాచెదురుగా పడిపోయాయి. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

కారు గ్యారేజీలో చోరీ

ఆదిలాబాద్‌రూరల్‌: మావల పోలీస్‌స్టేషన్‌ పరిధిలోని టీచర్స్‌ కాలనీలోని కారు గ్యారేజీలో బుధవారం రాత్రి గుర్తు తెలియని వ్యక్తులు చోరీకి పాల్పడ్డారు. గ్యారేజీలో చొరబడి రూ.40వేలు దొంగలించి తీసుకెళ్లినట్లు గ్యారేజ్‌ యజమాని మోసిన్‌ తెలిపారు. ఫిర్యాదు అందలేదని పోలీసులు పేర్కొన్నారు.

ఉరేసుకుని యువకుడి ఆత్మహత్య



యోగేశ్‌ (ఫైల్‌)

ముధోల్‌: మద్యానికి బానిసై యువకుడు ఉరేసుకుని ఆత్మహత్యకు పాల్పడిన సంఘటన మండల కేంద్రంలోని బట్టిగల్లిలో గురువారం చోటుచేసుకుంది. పోలీసుల వివరాల ప్రకారం... నాయనోల్ల యోగేశ్‌ (30) కొంత కాలంగా మద్యానికి బానిసయ్యాడు. జీవితంపై విరక్తి చెంది ఇంట్లో ఎవరూ లేని సమయంలో దూలానికి ఉరేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఏఎస్సై సుదర్శన్‌ బుద్ధ తెలిపారు.

చిరుతపులి దాడిలో లేగదూడ మృతి

దిలావార్‌పూర్‌: మండలంలోని న్యూలోలం గ్రామ శివారులో అటవీశాఖ అధికారులు గురువారం లేగదూడ మృతదేహాన్ని గుర్తించారు. మోహన్‌కు చెందిన లేగదూడ మేతకు వెళ్లగా చిరుత దాడిచేసి చంపినట్లు పేర్కొన్నారు. సంఘటనా స్థలాన్ని బీట్‌ అధికారి వెన్నెల పరిశీలించి చిరుత దాడిచేసినట్లు నిర్ధారించారు.

చేపలవేటకు వెళ్లిన వ్యక్తి అదృశ్యం



తోకల గంగారాం (ఫైల్‌)

దిలావార్‌పూర్‌: మండలంలోని గుండంపల్లి గ్రామానికి చెందిన తోకల గంగారాం(43) బుధవారం ఉదయం సముందర్‌పల్లి గ్రామం శివారులోని ఎస్‌ఆర్‌ఎస్‌పిలోకి చేపల వేటకు వెళ్లి తిరిగి రాలేదు. ఆచూకీ కానరాకపోవడంతో కుటుంబ సభ్యులు గురువారం పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేసింది. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఏఎస్సై భీంరావు తెలిపారు.







వంగిన విద్యుత్‌ స్తంభాలు..

పంట చేలల్లో వ్యవసాయ సాగు కోసం ఏర్పాటు చేసిన విద్యుత్‌ లైన్లకు సంబంధించిన స్తంభాలు వంగిపోయి ప్రమాదకరంగా మారాయి. వంగిపోయిన స్తంభాలతో అన్నదాతలు ఆందోళన చెందుతున్నారు. అందుకు అద్దం పట్టే ఈ చిత్రం జైనథ్‌ మండలం ఆనంద్‌పూర్‌లో కనిపించింది. - సాక్షి ఫొటోగ్రాఫర్, ఆదిలాబాద్‌

గుస్సాడీ బృందానికి పీవో అభినందన



ఐటీడీఏ పీవో వరుణ్‌రెడ్డికి గుస్సాడీ టోపిని బహూకరిస్తున్న బృందం సభ్యులు

నార్నూర్‌(జైనూర్‌): గణతంత్ర వేడుకల్లో భాగంగా ఢిల్లీలో ప్రదర్శన ఇచ్చి వచ్చిన పద్మశ్రీ గుస్సాడీ కనకరాజు బృందాన్ని ఐటీడీఏ పీవో వరుణ్‌రెడ్డి గురువారం తన క్యాంపు కార్యాలయంలో అభినందించారు. రాష్ట్రస్థాయి నుంచి సౌత్‌జోన్, నార్త్‌ జోన్‌ కళా ప్రదర్శనల్లో ఉత్తమ ప్రతిభ కనబర్చిన గుస్సాడీ కళాకారులు పీవోను కలిసి గుస్సాడీ టోపి బహూకరించారు. ఈ సందర్భంగా కనకరాజు మాట్లాడుతూ ఆదివాసీ సంస్కృతి, సంప్రదాయాలు బయటి ప్రపంచానికి పరిచయం చేయడానికి సహాయ సహకారాలు అందించిన పీవో బదిలీ బాధాకరమని అన్నారు. విద్యాభివృద్ధి కోసం అక్షరజ్యోతి వంటి ప్రత్యేక కార్యక్రమాలు ఆశ్రమ పాఠశాలల్లో అమలు చేశారని కొనియాడారు. ఈ కార్యక్రమంలో గుస్సాడీ టీం లీడర్‌ కనక సుదర్శన్, సర్పంచ్‌ కనక ప్రతిభ వెంకటేశ్వరావు, ఉప సర్పంచ్‌ సావిత్ర ధర్మేందర్, గ్రామం పటేల్‌ మాణిక్‌రావు, మాజీ సర్పంచ్‌ కనక కొద్దు, హైమన్‌ డార్ఫ్‌ యూత్‌ గుస్సాడీ బృందం సభ్యులు పాల్గొన్నారు.

పోలీసుల గురి తప్పొద్దు



ఫైరింగ్‌ చేస్తున్న ఎస్పీ ఉదయ్‌కుమార్‌రెడ్డి



టియర్‌ గ్యాస్‌ను పరిశీలిస్తున్న ఎస్పీ

- ఎస్పీ ఉదయ్‌కుమార్‌ రెడ్డి

తలమడుగు: పోలీసులు శిక్షణ సమయంలో నేర్చుకున్న ఫైరింగ్‌లో గురి తప్పవద్దని ఎస్పీ ఉదయ్‌కుమార్‌ రెడ్డి అన్నారు. గురువారం మండలంలోని సుంకిడి ఫైరింగ్‌ బట్‌ మైదానంలో ఫైరింగ్‌ ప్రాక్టీస్‌ను పరిశీలించారు. అనంతరం ఎస్పీ ఫైరింగ్‌ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పోలీసులకు శిక్షణ సమయంలో నేర్చుకున్న మెళకువలను గుర్తుంచుకోవాలని సూచించారు. ఆదిలాబాద్‌ జిల్లాలోని కానిస్టేబుల్‌ స్థాయి నుంచి ఎస్పీ స్థాయి వరకు ప్రతిఒక్కరూ వివిధ రకాల ఆయుధాలతో ఫైరింగ్‌ చేయడం జరుగుతుందన్నారు. వజ్ర వాహనంలోని టియర్‌ గ్యాస్‌ షెల్‌ను పరిశీలించారు. కార్యక్రమంలో అదనపు ఎస్పీలు శ్రీనివాస్‌రావు, సమయ్‌ జాన్‌రావు, డీఎస్పీ ఉమేందర్‌ ఉన్నారు.

పట్టుబడిన వాహనాలకు వేలం



టెండర్లు పరిశీలిస్తున్న సిబ్బంది

ఇచ్చోడ: మండల కేంద్రంలోని సబ్‌ డివిజన్‌ పరిధిలో పట్టుబడిన వాహనాలకు గురువారం వేలం నిర్వహించినట్లు ఎఫ్‌డీవో బర్నోబా తెలిపారు. 198 పాత వాహనాలకు వేలం నిర్వహించగా 144 వాహనాలకు టెండర్లు దాఖలయ్యాయి. ఈ వేలం ద్వారా అటవీశాఖకు రూ.45లక్షల40వేల ఆదాయం సమకూరింది. మరో 54 వాహనాలకు వివిధ కారణాలతో వేలం రద్దు చేశారు. అలాగే టెండర్లలో పాల్గొన్న వ్యాపారులు చెల్లించిన ఈఎండీ ద్వారా మరో రూ.2లక్షల72వేలు వచ్చినట్లు ఎఫ్‌డీవో వివరించారు. ఇందులో ఎంపీఐ ప్రదీప్‌కుమార్‌ ఇచ్చోడ, నేరడిగొండ, బోథ్‌ ఎఫ్‌ఆర్వోలు పాండురంగ్, గణేష్, ప్రణయ్‌ ఉన్నారు.

కొనసాగుతున్న సమ్మక్క - సారలమ్మ జాతర



మొక్కులు తీర్చుకుంటున్న భక్తులు

ముధోల్‌: మండలంలోని ఎడ్‌బిడ్‌ తండా సమీపంలోని గుట్టపై సమ్మక్క – సారలమ్మ జాతర కొనసాగుతోంది. గురువారం భక్తులు తరలివచ్చి మొక్కులు చెల్లించుకున్నారు. బంగారం(బెల్లం) సమర్పించారు. కోళ్లు, మేకలు బలి ఇచ్చారు. భక్తుల కోసం ఆలయ వ్యవస్థాకురాలు రేణుకమ్మ ఏర్పాట్లు చేశారు.

మంత్రి, సెక్రెటరీని కలిసిన ఎమ్మెల్యే



ఫైనాన్స్‌ డిపార్ట్‌మెంట్‌ సెక్రెటరీని కలిసిన ఎమ్మెల్యే

ఖానాపూర్‌: నియోజకవర్గంలోని పలు అభివృద్ధి పనుల విషయమై ఎమ్మెల్యే అజ్మీరా రేఖానాయక్‌ గిరిజన శాఖ మంత్రి సత్యవతి రాథోడ్‌తోపాటు ఫైనాన్స్‌ డిపార్ట్‌మెంట్‌ సెక్రటరీ నర్సింగరావును హైదరాబాద్‌లో గురువారం వేర్వేరుగా కలిశారు. నియోజకవర్గంలోని పలు బీటీ రోడ్ల నిర్మాణం, ఇతర అభివృద్ధి పనుల విషయమై మంత్రికి విన్నవించారు. నియోజకవర్గంతోపాటు మున్సిపాలిటీ పరిధిలో జరుగుతున్న అభివృద్ధి పనులతోపాటు డీఎంఎఫ్‌టీ ఇతర నిధుల కోసం ఫైనాన్స్‌ డిపార్ట్‌మెంట్‌ సెక్రటరీని కలిశారు. ఎమ్మెల్యే వెంట మున్సిపల్‌ చైర్మన్‌ రాజేందర్, నాయకులు ప్రదీప్, చరణ్‌ తదితరులు ఉన్నారు.

టెక్నికల్‌ సర్టిఫికెట్‌ కోర్సు పరీక్షల షెడ్యూలు విడుదల

నిర్మల్‌ రూరల్‌: జిల్లాలో టెక్నికల్‌ సర్టిఫికెట్‌ కోర్సు పరీక్షల షెడ్యూల్‌ విడుదలైందని డీఈవో రవీందర్‌ రెడ్డి తెలిపారు. పరీక్షలు ఫిబ్రవరి 11 నుంచి 14వ తేదీ వరకు నిర్వహిస్తామని పేర్కొన్నారు. డ్రాయింగ్‌ లోయర్, హయ్యర్‌ గ్రేడ్‌ పరీక్షలు 4 రోజులు ఉదయం, మధ్యాహ్నం ఉంటాయని వివరించారు. టైలరింగ్, ఎంబ్రాయిడరీ లోయర్‌గ్రేడ్‌ పరీక్షలు ఫిబ్రవరి 11న ఉదయం, మధ్యాహ్నం వేళలో మొదటి, రెండో పేపర్ల పరీక్షలు ఉంటాయని తెలిపారు. టైలరింగ్, ఎంబ్రాయిడరింగ్‌ హయ్యర్‌ గ్రేడ్‌ పరీక్షలు ఫిబ్రవరి 12న ఉదయం, మధ్యాహ్నం మొదటి, రెండవ పేపర్లు ఫిబ్రవరి 13న మూడో పేపర్‌ పరీక్షలు నిర్వహిస్తారని వెల్లడించారు. డ్రాయింగ్‌ లోయర్‌ గ్రేడ్‌ పరీక్షకు 156 మంది, డ్రాయింగ్‌ హయ్యర్‌ గ్రేడ్‌ పరీక్షకు 87 మంది, టైలరింగ్, ఎంబ్రాయిడరీ లోయర్‌గ్రేడ్‌ పరీక్షకు 70 మంది, టైలరింగ్, ఎంబ్రాయిడరీ హయ్యర్‌గ్రేడ్‌ పరీక్షకు 31 మంది మొత్తం 344 మంది టెక్నికల్‌ సర్టిఫికెట్‌సర్టిఫికెట్‌ కోర్సు పరీక్షలకు హాజరవుతారని వివరించారు. అభ్యర్థులు షెడ్యూల్‌ ప్రకారం పరీక్షలు రాయాలని తెలిపారు. తమ పరీక్షల హాల్‌ టికెట్లను www. bsetelangana. gov. in వెబ్‌సైట్‌ నుంచి డౌన్‌లోడ్‌ చేసుకోవాలని సూచించారు.

స్కౌట్స్‌ అండ్‌ గైడ్స్‌ కేంద్రం ప్రారంభం



యూనిఫారం ఇస్తున్న యాదవ్‌రావు

బేల: మండలంలోని సైద్‌పూర్‌ గ్రామంలోని బాలుర ఆశ్రమోన్నత పాఠశాలలో గురువారం స్కౌట్స్‌ అండ్‌ గైడ్స్‌ యూనిట్‌ను ఉమ్మడి జిల్లా స్కౌట్స్‌ మాస్టర్‌ యాదవ్‌రావు ప్రారంభించారు. దీంతో పాటు విద్యార్థులకు ఆ యూనిఫారాలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయుడు రాథోడ్‌ గణేష్‌కుమార్, ఫిజికల్‌ డైరెక్టర్‌ లక్ష్మణ్‌ పవార్, సీనియర్‌ ఉపాధ్యాయులు జ్ఞానేశ్వర్, ఉదారి నారాయణ పాల్గొన్నారు.

ప్రమాదబీమా పథకంతో తోడ్పాటు



సమావేశంలో మాట్లాడుతున్న సుహాసిని రెడ్డి

ఆదిలాబాద్‌: ప్రమాదబీమా పథకాలతో పేద, మధ్యతరగతి తరగతి కుటుంబాలకు ఎంతగానో తోడ్పాటును అందజేస్తాయని బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యురాలు చిట్యాల సుహాసినిరెడ్డి అన్నారు. జిల్లా కేంద్రంలోని ఆమె నివాసంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో గురువారం మాట్లాడారు. సన్నకారు రైతులు, చిరు ఉద్యోగులకు బీమా సౌకర్యాన్ని కల్పించనున్నట్లు వెల్లడించారు. గ్రోమోర్‌ సంస్థ ద్వారా అందిస్తున్న ఇన్సూరెన్స్‌ పథకం ద్వారా రూ.59 ప్రీమియంతో రూ. 2.50 లక్షల వరకు ప్రమాద బీమా లభ్యమవుతుందని వివరించారు. అదేవిధంగా రూ.5వేల ఆర్థిక సహాయం సైతం పిల్లల చదువు కోసం అందుతుందన్నారు. ఈ నేపథ్యంలోనే సన్నకారు రైతులు, కుల వృత్తిదారులు, చిరు వ్యాపారులు, చిరు ఉద్యోగులకు పథకానికి సంబంధించిన ప్రీమియంను చెల్లించాలని తెలిపారు. సమావేశంలో బీజేపీ నాయకులు గందె విజయ్‌ కుమార్, గటిక క్రాంతి కుమార్, సంతోశ్‌ కొత్తపెల్లి తదితరులు ఉన్నారు.

11న జెడ్పీ స్థాయీ సంఘ సమావేశాలు

కైలాస్‌నగర్‌: ఈ నెల 11న జెడ్పీ స్థాయీ సంఘ సమావేశాలు నిర్వహించనున్నట్లు జెడ్పీ సీఈవో బీ గణపతి ఓ ప్రకటనలో తెలిపారు. గ్రామీణాభివృద్ధి, వ్యవసాయం, విద్య, వైద్యం, మహిళా సంక్షేమం, సాంఘిక సంక్షేమం, పనుల స్థాయీ కమిటీ, ప్రణాళిక, ఆర్థిక స్థాయీ సంఘ సమావేశాలు ఆయా కమిటీల అధ్యక్షుల నేతృత్వంలో నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. సంబంధిత శాఖల అధికారులు ఈనెల 7లోగా తమ శాఖ ప్రగతి నివేదికలను 40 కాపీల చొప్పున తన కార్యాలయానికి పంపించాలని సూచించారు. సంబంధిత సభ్యులు, అధికారులు సకాలంలో హాజరు కావాలని కోరారు.

బెదిరింపులకు పాల్పడిన ముగ్గురిపై కేసు

ఆదిలాబాద్‌టౌన్‌: ఇంటిని ఖాళీ చేయాలని బెదిరింపులకు పాల్పడిన ముగ్గురిపై కేసు నమోదు చేసినట్లు టూటౌన్‌ ఎస్సై విష్ణు ప్రకాష్‌ తెలిపారు. ఆయన కథనం ప్రకారం. ఆదిలాబాద్‌ పట్టణంలోని రిక్షా కాలనీలో రంజాన్‌ఖాన్‌ ఓ ఇల్లు కొనుగోలు చేశాడు. ఇందులో తన కూతురు రిజ్వాన్‌ బేగంకు ఒక పోర్షన్‌ ఇచ్చాడు. రిజ్వాన బేగం అన్న వదినలైన షబ్బీర్‌ ఖాన్, షమీమ్‌లు ఇంటిని ఖాళీ చేయాలని బెదిరింపులకు పాల్పడడంతో పాటు దాడి చేసినట్లు బాధితురాలు ఫిర్యాదు చేసింది. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

నేరడిగొండలో దొంగలు పడ్డారని పుకార్లు



వడూర్‌లో గస్తీ కాస్తున్న గ్రామస్తులు

నేరడిగొండ: మండల కేంద్రంలో గురువారం రాత్రి దొంగలు పడ్డారనే వార్త పుకార్లు రేపింది. దీంతో పలు గ్రామాల్లో స్థానికులు గస్తీ కాశారు. అయితే మండల కేంద్రంలో గురువారం సాయంత్రం కాంగ్రెస్‌ పార్టీ బోథ్‌ నియోజకవర్గ నాయకుడు ఆడె గజేందర్‌ ఇంటి వద్ద కొంతమంది మహారాష్ట్రకు చెందిన వారు కనిపించారు. దీంతో వారిని దొంగలనే అనుమానంతో స్థానికులు అదుపులోకి తీసుకుని పోలీసులకు సమాచారం ఇచ్చారు. పోలీసులు చేరుకుని వారిని పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. వివరాలు సేకరించి వారు దొంగలు కారని తేల్చి వదిలిపెట్టారు. అప్పటికే మండల కేంద్రంలో దొంగలు పడ్డారనే వార్త చుట్టుపక్కల గ్రామాలకు వ్యాపించింది.

వంద శాతం ఉత్తీర్ణతకు కృషి చేయాలి



పుస్తకాలు అందిస్తున్న జీసీడీవో ఛాయ

ఇంద్రవెల్లి: ఆశ్రమ పాఠశాలల్లో చదువుతున్న 10వ తరగతి విద్యార్థులు 100శాతం ఉత్తీర్ణత సాధించే విధంగా ఇప్పటి నుంచే కృషి చేయాలని జీసీడీవో ఛాయ అన్నారు. గురువారం మండల కేంద్రంలోని ఆశ్రమ బాలికల పాఠశాలను సందర్శించారు. ఉపాధ్యాయులతో కలిసి గిరిజన సంక్షేమ శాఖ నుంచి అందించిన ఆల్‌ ఇన్‌ వన్‌ స్టడీ మెటీరియల్‌ను అందజేశారు. 10వ తరగతి విద్యార్థులతో మాట్లాడి సలహాలు, సూచనలు చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడారు. 10వ తరగతి విద్యార్థులకు ప్రత్యేక తరగతులు నిర్వహించి ప్రతి ఒక్కరూ ఏ గ్రేడ్‌ సాధించే విధంగా కృషి చేయాలన్నారు. అదే విధంగా వసతి గృహాల్లో విద్యార్థులకు ఎలాంటి సమస్య లేకుండా జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు.

అమ్మవారిని దర్శించుకున్న కలెక్టర్‌



అమ్మవారికి పూజలు చేస్తున్న కలెక్టర్‌ వరుణ్‌రెడ్డి


భైంసా: జిల్లా నూతన కలెక్టర్‌ వరుణ్‌రెడ్డి బాసర శ్రీజ్ఞాన సరస్వతీ అమ్మవారిని గురువారం దర్శించుకున్నారు. ఆలయ అధికారులు ఆయనకు స్వాగతం పలికారు. అమ్మవారికి ప్రత్యేక పూజలు చేసిన కలెక్టర్‌కు తీర్థప్రసాదాలు అందజేశారు. ఆయన వెంట ఆర్డీవో రవికుమార్, తదితరులున్నారు.

కేంద్రీయ విద్యాలయం ఏర్పాటుకు వినతి..


బాసర మండల కేంద్రంలో కేంద్రీయ విద్యాలయం ఏర్పాటు చేయాలని స్థానిక యువకులు కలెక్టర్‌ను కోరారు. ఈ మేరకు గురువారం బాసర వచ్చిన ఆయను కలిసి వినతిపత్రం అందించారు. గోదావరి వంతెనపై రక్షణ కంచె ఏర్పాటు చేయించాలని కోరారు.



గోడలపై గీయించిన బొమ్మలు



గోడలపై గీసిన సైన్స్‌ బొమ్మలు



పాఠశాల గోడలపై ప్రధానమైన బొమ్మలు

బొమ్మలతో బోధన

నార్నూర్: మండల కేంద్రంలోని మండల పరిషత్‌ ప్రాథమిక పాఠశాలలో ప్రైవేటు పాఠశాలకు దీటుగా ఉపాధ్యాయులు విద్యార్థులకు బోధిస్తున్నారు. పాఠశాల గోడలపై ఉపాధ్యాయుల సహకారంతో తెలుగు, ఇంగ్లిష్‌ వర్ణమాల, అంకెలు, సంఖ్యలు, వాడుక భాషలో కనిపించే ఆంగ్ల పదాలు, జంతువులు, పక్షులు, సైన్స్‌కు సంబంధించిన చిత్రాలు గీయించారు. వాటిని చూపుతూ బోధన చేస్తున్నారు. దీంతో విద్యార్థులకు సులువుగా పాఠాలు అర్థం అవడంతో పాటు ఎప్పటికీ గుర్తుంటాయని ఉపాధ్యాయులు చెబుతున్నారు. బొమ్మలతో విద్యాబోధన చేయడంతో విద్యార్థులు ఆసక్తి చూపుతున్నారని పాఠశాల ప్రధానోపాధ్యాయుడు చౌహాన్‌ హరిచంద్‌ తెలిపారు.